క్లుప్తంగా

లలితా పీఠంలో వారాహి హోమం



వారాహి హోమంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో ఈ నెల 6 నుంచి జరుగుతున్న వారాహి దేవి నవరాత్రుల్లో భాగంగా గురువారం సాయంత్రం వారాహి హోమం నిర్వహించారు. పీఠం దర్బారు హాల్లో పండితుల వేద మంత్రాల మధ్యం శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. పలువురు భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముందుగా వారాహి దేవికి సహస్ర నామార్చన చేసి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ నెల 15వ తేదీతో నవరాత్రులు ముగుస్తాయని ఆయన తెలిపారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీ డెంటల్ హాస్పిటల్, రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భక్తులకు, పేదలకు దంత, బీపీ, సుగర్ వైద్య పరీక్షలు చేసి, జాగ్రత్తలు వివరించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం మహిళా భక్తుల చేతుల మీదుగా పల్లకీ సేవ, బాబా భజన కార్యక్రమాలు జరిగాయి. రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ప్రెసిడెంట్ ఎండీ యాసిన్, సెక్రటరీ సిహెచ్.నేతాజి, డాక్టర్ ఎన్ఎస్ఎన్ రాజు, వీ డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్, సిహెచ్.కృష్ణ, డాక్టర్ తరుణ్ తేజ్, ధ్యాన మందిర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



రైల్వే న్యూకాలనీలో అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలియజేస్తూ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షా కాలంలో అతిసార వ్యాధి ప్రబలే అవకాశాలున్నాయని, దోమల వల్ల వ్యాపించే జ్వరాలు, ఇతర వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బంది సూచించారు. జీవీఎంసీ సీవో ధనలక్ష్మి, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకిరెడ్డి జగదీష్, బీజేపీ వార్డు ప్రెసిడెంట్ గురుగోవింద్ సింగ్, టీడీపీ వార్డు ప్రెసిడెంట్ కె.వెంకటరమణారావు, ఆర్పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రెండో శనివారం స్కూళ్లకు సెలవు ఇవ్వాలి

విశాఖ విద్య: రెండో శనివారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు తప్పనిసరిగా సెలవు ప్రకటించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి. సీతారాం ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రతీ నెలా రెండో శనివారం సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, జిల్లాలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టి సారించాలన్నారు. విద్యా క్యాలెండర్ పనిదినాలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలకు సిఫార్స్ చేస్తామన్నారు. జిల్లాలో రెండో శనివారం, లేదా ఆదివారం రోజుల్లో ఎక్కడైనా స్కూళ్లు తెరిచి, తరగతులు నిర్వహించినట్లెతై తల్లిదండ్రులు కమిషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అమ్మల ఆశలపై నీళ్లు



తల్లికి వందనమంటూ సీఎం చంద్రబాబు వారి ఆశలపై నీళ్లు జల్లుతున్నారు. పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం పేరిట ఏడాదికి రూ.15 వేల చొప్పున.. ఇంట్లో ఎంతమంది ఉంటే అందిరికీ అందజేస్తామని చెప్పిన నూతన కూటమి ప్రభుత్వం మాట మార్చింది. చంద్రబాబు ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి తనకు తెలిసిన విద్యలన్నీ ప్రదర్శిస్తోంది. ప్రతి పథకానికి ఏదొక మెలిక పెట్టి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించుకునే చాకచక్యానికి సిద్ధమైంది.

- 'తల్లికి వందనం' అందజేతలో మెలిక
- పిల్లల్లో ఒక్కరికే రూ.15 వేలు ఇస్తామని మార్గదర్శకాలు జారీ
- మాట మార్చిన కూటమి ప్రభుత్వం
- అందరికీ అమలు చేయాలని విద్యార్థుల తల్లుల డిమాండ్

మురళీనగర్/సీతంపేట/సీతమ్మధార/కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేద ప్రజల చదువుకు భరోసా ఇవ్వడానికి అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టింది. తమ పిల్లలను చదివించడానికి తల్లి దండ్రులకు ఎటువంటి భారం లేకుండా అవసరమైన ఆర్థిక సాయం అందించాలనే గొప్ప లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టి ఇంట్లో ఒకరికి ఏడాదికి రూ.15,000 ఇచ్చింది. ఆ విద్యార్థి చదువుతున్న యాజమాన్యంతో పనిలేకుండా ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేసింది. దీంతో పాటు జగనన్న విద్యా కానుక ద్వారా కిట్లు పంపిణీ చేయడం వల్ల కనీసం పైసా ఖర్చు లేకుండా పేద తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించుకో గలిగారు. ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నేతలు తల్లికి వందనం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అందరికీ రూ.15,000 చొప్పున అందిస్తామని హామీ ఇచ్చారు. కొత్త జీవోలో ఈ ప్రస్తావన ఎక్కడా లేదు. దీంతో కేవలం ఒక పిల్లవాడికే తల్లికి వందనం ఇస్తారనే అనుమానాలు ప్రజల్లో రేకెత్తిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉత్తర నియోజకవర్గంలో 25 వేల మందికి పైగా విద్యార్థులు అమ్మ ఒడి పథకం ద్వారా లబ్ధి పొందారు. ఈ నెల నుంచే ఇంట్లో చదువుకుంటున్న అందరు పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



మా ఇంట్లో ఇద్దరు పిల్లలున్నారు. అబ్బాయి హర్షవర్ధన్ 6వ తరగతి, పాప భవ్యశ్రీ 4వ తరగతి శ్రీ చైతన్య స్కూల్‌లో చదువుతున్నారు. అక్కడ ఫీజు కట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే సగం ఫీజు కట్టాం. ఇంట్లో ఎంతమంది పాఠశాలకు వెళ్తే అంతమందికి తల్లికి వందనం పథకంలో రూ.15,000 చొప్పున ఇస్తామని తెలుగుదేశం హామీ ఇచ్చింది. దీని ప్రకారం మాకు రూ.30,000 రావాలి. కొత్త జీవో తీసుకొచ్చి ఒక్కరికే ఇస్తామన్నట్లు చెబుతున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఈ నెల నుంచే అమలు చేయాలి.

– రొంగలి వరలక్ష్మి, సత్యానగర్

పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేదు



మాకు పాప, బాబు ఉన్నారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం పేరిట రూ.15 వేలు ఇస్తామని టీడీపీ మేనిఫెస్టోలో హామీ ఇవ్వడంతో మా పిల్లలను ప్రైవేటు స్కూల్‌లో చేర్పించాం. ఇప్పటి వరకు నా ఖాతాలో డబ్బులు పడకపోవడంతో పిల్లల ఫీజులు చెల్లించలేదు. జ్ఞానాపురం ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యం ఇబ్బంది పెడుతున్నారు. కొత్త ప్రభుత్వం అందించే తల్లికి వందనం డబ్బుల కోసం ఎదురుచుస్తున్నాం.

– కంచిపాటి రూత్‌మేరీ, కంచరపాలెం

అప్పు చేసి ఫీజులు కట్టాం



మాకు పాప, బాబు ఉన్నారు. ఇద్దరినీ జ్ఞానాపురం స్కూల్‌లో చదివిస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కావస్తున్నా.. తల్లికి వందనం జాడ మాత్రం కనిపించలేదు. దీంతో అప్పు చేసి మా పిల్లల స్కూల్ ఫీజులు కట్టాం. స్టూడెంట్ కిట్లు అసంపూర్తిగానే పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో విద్యా కానుకలు పాఠశాలలు తెరిచిన వారంలోనే మా పిల్లలకు అందించేవారు. నెల రోజుల్లోనే అమ్మ ఒడి పేరిట తల్లి ఖాతాల్లో డబ్బులు జమ చేసేవారు. తల్లికి వందనం పేరిట తల్లుల ఖాతాల్లో డబ్బుల వేసే పరిస్థితి కనించలేదు సరికదా.. మార్గదర్శకాల పేరిట తాత్సారం చేస్తున్నారు.

– పి.శ్యామల, కంచరపాలెం

ఆశగా ఎదురుచూస్తున్నాం



నా కుమారుడికి ఇద్దరు ఆడ పిల్లలు. జీవీఎంసీ స్కూల్‌లో చదివిస్తున్నాడు. ఆటో నడుపుతూ చాలీచాలని ఆదాయంతో ఇద్దరు ఆడపిల్లలను చదివిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. అద్దె ఇళ్లు. గత ప్రభుత్వంలో చిన్నమ్మాయికి అమ్మ ఒడి అందుకున్నాం. అమ్మ ఒడి డబ్బులు పిల్లలిద్దరి ట్యూషన్ కోసం ఖర్చుచేశాం. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ.15 వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పాడు. స్కూల్ తెరిచి నెల రోజులు కావస్తోంది. ఇప్పటి వరకు ఆ జాడ లేదు. ఇద్దరు పిల్లలకు రూ.30 వేలు వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నాం.

– రాజేశ్వరి, అక్కయ్యపాలెం

ఇచ్చిన హామీ నెరవేర్చాలి



కూటమి ప్రభుత్వం విద్యార్థుల తల్లులకు అందిస్తామని చెప్పిన తల్లికి వందనం పథకం డబ్బులు ఖాతాలో ఇంకా పడలేదు. ఇంట్లో అంతమంది పిల్లలకు రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పినప్పటికీ అకౌంట్‌లో డబ్బులు పడకపోవడంతో మేమంతా ఎదురు చూస్తున్నాం. నాకు ఇద్దరు పిల్లలు. భావన స్కూల్(ప్రైవేట్)లో బాబు ఏడో తరగతి, పాప పి.లక్ష్మీలావణ్య 9వ తరగతి చదువుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన హామీ నెరవేర్చి తల్లికి వందనం పేరుతో ఇస్తామన్న డబ్బులు త్వరగా వేయాలి.

– టి.దేవి, నక్కవానిపాలెం

'తల్లికి వందనం' డబ్బులు రాలేదు



తెలుగుదేశం పార్టీ అమ్మ ఒడి పథకం పేరు మార్చి తల్లికి వందనం పేరుతో విద్యార్థుల తల్లులకు డబ్బులు అందిస్తానంది. మ్యానిఫెస్టోలో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి రూ.15 వేల చొప్పున ఇస్తామని పేర్కొంది. నాకు ఇద్దరు పిల్లలు. భావన ప్రైవేట్ స్కూల్‌లో చిన్నబాబు భువనసాయి(ఫస్ట్ క్లాస్), రామకార్తీక్ (రెండో తరగతి) చదువుతున్నాడు. ప్రస్తుతం మా పిల్లలకు రూ.15 వేలు రాలేదు. ఎతం మంది ఉంటే అంతమందికి ఇస్తామన్నారు. ఒకరికి కూడా రాలేదు. గతంలో అమ్మ ఒడి డబ్బులు ఖాతాలో పడ్డాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు పిల్లలందరికీ తల్లికి వందనం డబ్బు ఇవ్వాలి.

– అడపాక వరలక్ష్మి, నక్కవానిపాలెం

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం



అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కార్తీక్

సీతమ్మధార: అకస్మాత్తుగా సంభవించే అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ విశాఖపట్నం, జేసీఐ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నక్కవానిపాలెం శారద విద్యాలయంలో అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలను విద్యార్థులకు నేర్పించడం అభినందనీయమన్నారు. పర్యావరణ అగ్నిప్రమాదాలపై జేసీఐ జోన్ అధ్యక్షుడు జేఎఫ్‌బీ సురేష్ సూచనలిచ్చారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు బి.వినయ్‌గాంధీ, జేసీఐ విశాఖ మెట్రో ప్రతినిధులు చంద్రశేఖర్, ప్రవీణ, శ్రీనివాసరావు, కార్తీక్, రంగాచార్యులు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

షిర్డీసాయిబాబాకు లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చనలో షిర్డీసాయి

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో గురువారం బాబాకు ప్రధాన అర్చకుడు రాజాస్వామి పలు రకాల పువ్వులతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 వరకు లక్ష పుష్పాలతో అర్చన చేస్తామని తెలిపారు. ఈ నెల 21న గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం 7 గంటలకు సుదర్శన హోమం, ప్రత్యేక అభిషేకాలు. సాయంత్రం 4 గంటలకు 200 కిలోల బియ్యంతో సాయిబాబాకు అన్నాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. 6 గంటలకు భక్తి సంగీత కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలోని హెచ్‌టీ లైన్లపై నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ (ఆపరేషన్స్) బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నరసింహనగర్ రైతుబజార్ ప్రాంతం, గణేష్‌నగర్, గణేష్ సేవా సంఘం, వరాహగిరి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అబిద్‌నగర్, అక్కయ్యపాలెం, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

మర్రిపాలెం సెక్షన్‌లో..

మురళీనగర్: జోన్–2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ కప్పరాడ, ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అరుంధతి నగర్, అప్పర్ జయప్రకాష్‌నగర్, బాబూజీ నగర్, తిక్కవానిపాలెం, కప్పరాడ, రాంజీ ఎస్టేట్స్, పెద కొత్తూరు, ఏఎస్సార్ నగర్, జయప్రకాష్‌నగర్, సురేష్ రామ్‌నగర్, జగ్జీవన్ నగర్, అంబేడ్కర్ నగర్, ఇందిరానగర్ 1–5 ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మురళీనగర్ సెక్షన్‌లో..

మురళీనగర్ సెక్షన్ పరిధి సత్యానగర్ 11 కేవీ ఫీడరులో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సత్యానగర్, సాయిరామ్‌నగర్, మంచుకొండ గార్డెన్స్, పట్టాభిరెడ్డితోట, పాలిటెక్నిక్ వెనక ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని ఈఈ కోరారు.

జనాభా నియంత్రణ సమష్టి బాధ్యత

మహారాణిపేట: ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డీఎంహెచ్‌వో) ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ జరిగింది. రేసవానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు జరిగింది. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడతూ పెరుగుతున్న జనాభాను నియంత్రించవలసిన అవసరం ఉందన్నారు. వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ ట్రెనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వరరావు,అధికారులు పాల్గొన్నారు.

కూలే స్థితిలో చెట్టు



ఎన్జీజీవోస్ కాలనీలో హై టెన్షన్ విద్యుత్ తీగలపై ఒరిగిన చెట్టు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో శ్రీరంగ సామ్రాజ్యం అపార్ట్‌మెంట్ (ఇంటి నంబర్ 49–36–15/2) వద్ద ఉన్న ఒక చెట్టు కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. చాలా వరకు చెట్టు ఒరిగిపోయింది. దాని కొమ్మలు హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగులుకొని ఉండటంతో చెట్టు పడకుండ ఉంది. అసలే వర్షా కాలం.. గట్టిగా గాలి వీస్తే చెట్టు ఎవరి మీద పడుతుందోనని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. చెట్టు కూలితే విద్యుత్ తీగలు సైతం తెగిపడే అవకాశం ఉందంటున్నారు. వర్షం పడినప్పుడు చెట్టును ముట్టుకుంటే షాక్ కొడుతోందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మన భద్రతకే ట్రాఫిక్ నిబంధనలు



మాట్లాడుతున్న వెంకట శేషమ్మ



పాల్గొన్న సీతమ్మధార రైతుబజార్ రైతులు

సీతమ్మధార: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ అన్నారు. సీతమ్మధార రైతుబజారులో గురువారం రైతులు, వినియోగదారులను ఉద్దేశించి ఆమె పలు సూచనలిచ్చారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, లేకుంటే నేరమన్నారు. మోటార్ వాహన చట్టాలను వివరించారు. టీపీటీ కాలనీలోని ఎస్‌బీఎం కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పీడీఎం కోర్టు జడ్జి జి.స్వర్ణ, పీఎల్‌ఏపీయూఎస్ అధ్యక్షుడు జి.వల్లభనాయుడు, ఏడీఎం కోర్టు సూర్యకళ, ప్యానల్ లాయర్ కె.రవిశంకర్, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

మాధవధార నుంచి ఆర్కే బీచ్‌కు సిటీ బస్సు సర్వీస్

డాబాగార్డెన్స్: ఉత్తర నియోజకవర్గ పరిధి మాధవధార, ఎన్‌జీవోస్ కాలనీ నుంచి ఆర్కేబీచ్, సింహాచలం బస్ కాంప్లెక్స్‌కు 48–ఎస్ రూట్ నంబర్‌తో సిటీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు పేర్కొన్నారు. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల ప్రయాణికుల సౌకర్యార్థం సింహాచలం, ఆర్కే బీచ్‌కు వెళ్లేందుకు డైరెక్ట్‌గా ఈ సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆయా ప్రాంతాలకు రూట్ నంబర్ 48–ఎస్‌తో రెండు సిటీ సర్వీసులు తిప్పుతున్నట్టు చెప్పారు. ఈ బస్సులు ఆర్కే బీచ్ నుంచి బయలుదేరి కలెక్టర్ ఆఫీస్, జగదాంబ, సూర్యాబాగ్, డాబాగార్డెన్స్, ఆర్టీసీ కాంప్లెక్స్, దొండపర్తి, అక్కయ్యపాలెం, మధుసూధన్ నగర్, మాధవధార వుడా కాలనీ, ఆర్ అండ్ బీ, ఎన్ఏడీ, గోపాలపట్నం మీదుగా సింహాచలం బస్ కాంప్లెక్స్‌కు చేరుతుందని, సింహాచలం బస్ కాంప్లెక్స్ నుంచి అదే మార్గంలో ఆర్కే బీచ్‌కు చేరునని ప్రజా రవాణా అధికారి చెప్పారు.

టైమింగ్స్ ఇలా..

ఆర్కే బీచ్ నుంచి బయలుదేరు సమయం

ఉదయం 05:45, 06:45, 08:15, 09:15, 10:45, 11:45, మధ్యాహ్నం 1:55, 2:55, సాయంత్రం 5:25, 5:25, 6:55, రాత్రి 7:55

సింహాచలం నుంచి బయలుదేరు సమయం

ఉదయం 06:55, 07:55, 09:25, 10:25, 11:55, 12:55, మధ్యాహ్నం 3:05, సాయంత్రం 04:05, 05:35, 06:35, రాత్రి 08:20, 09:05

రైల్వే స్టేషన్ నుంచి గంభీరానికి సిటీ బస్సు సౌకర్యం

డాబాగార్డెన్స్: భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విశాఖ రైల్వే స్టేషన్ నుంచి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ గంభీరంకు రూట్ నంబరు 25–ఐఐఎమ్ సిటీ బస్సు సౌకర్యం కల్పించినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు తెలిపారు. ఈ బస్సు రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి ఆర్టీసీ కాంప్లెక్స్, మద్దిలపాలెం, హనుమంతువాక, మధురవాడ, మారికవలస మీదుగా ఐఐఎంకి చేరునని తెలిపారు.

రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరు సమయం..

ఉదయం 07:30, 10:20 మధ్యాహ్నం ఒంటి గంటకు..

ఐఐఎం నుంచి బయలుదేరు సమయం:

ఉదయం 08:55, 11:35, మధ్యాహ్నం 14.30, 18:15.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన



ఎస్ఎంసీ హైస్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న గొండు సీతారాం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పీఅండ్‌టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్ ప్లస్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు గొండు సీతారాం పరిశీలించారు. మధ్యాహ్నం విద్యార్థులకు వడ్డించిన భోజనం రుచి, వడ్డింపు తీరుపై తనిఖీ చేశారు. గుడ్డు ఇవ్వలేదని విద్యార్థులు చెప్పడంతో వెంటనే హెచ్‌ఎం డి.రాంప్రసాద్‌ను ఆయన ప్రశ్నించారు. పాత బకాయిల కారణంగా గుడ్లు సరఫరా కాలేదని చెప్పడంతో విద్యా శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. విద్యార్థులకు భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి బాలామణి, సీఆర్పీఎఫ్ ఫోరం కరుణాకర్, లీగల్ కన్వీనర్ ప్రవీణ, ఎల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ పనుల పరిశీలన



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు భీమ్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పనులను గురువారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆయన సూచించారు.

గిరిప్రదక్షిణ రోడ్డు శుభ్రం

ఈ నెల 20న సింహాచలం గిరిప్రదక్షిణను పురస్కరించుకుని మాధవధార మాధవ స్వామి ఆలయానికి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారం, డెబ్రిస్‌ను గురువారం జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. ఈ పనులను 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పరిశీలించారు. గిరి ప్రదక్షిణ కోసం వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండటం కోసం రహదారిని శుభ్రం చేయించినట్టు ఆయన తెలిపారు.

జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన బి.భార్గవి, జి.భార్గవిలను అభినందిస్తున్న హెచ్‌ఎం శాంతికుమారి, ఉపాధ్యాయ సిబ్బంది

సీతంపేట: మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థినులు నూజివీడు ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారని హెచ్‌ఎం శాంతికుమారి తెలిపారు. బి.భార్గవి, జి.భార్గవి ఈ ఘనత సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. బి.భార్గవి 579 మార్కులు, జి.భార్గవి 577 మార్కులు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులను హెచ్‌ఎం శాంతికుమారి, ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. మంచి మార్కులతో ట్రిపుల్‌ఐటీ పూర్తి చేసి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు.



ఉప్పాల ప్రతీక్

ఎస్ఎంసీ హైస్కూల్ విద్యార్థికి సీటు

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీ ఎస్ఎంసీ హైస్కూల్‌లో పదో తరగతి పాసైన ఉప్పాల ప్రతీక్(580/600) నూజివీడు రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీలో ఐఐటీలో ఇంజినీరింగ్ సీటు సంపాదించాడు. ప్రతిష్టాత్మకమైన న్యూజివీడు ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్ సీటు రావడంతో ఎస్ఎంసీ హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రతీక్‌ను అభినందించారు. ప్రతీక్ తండ్రి నాగేంద్రబాబు మెకానిక్‌గా, తల్లి లక్ష్మి టైలరింగ్ షాపులో పనిచేస్తున్నారు. కష్టపడి చదివించిన కుమారుడికి ఇంజినీరింగ్‌లో సీటు రావడంతో వారి ఆనందానికి అంతులేదు.